సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 15 । జూన్ । 2025

I



చిత్తూరు, అనంత జట్ల విజయ ఢంకా

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా మోగించాయి. -IIలో



ఆరుగురు దొంగలు అరెస్ట్

తాళం వేసిన ఇళ్లను గుర్తించి, పగటిపూట దొంగతనాలకు పాల్పడే ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి, రూ.20 లక్షల విలువచేసే నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.227
రెండోరకం	రూ.120	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1621 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	540	540
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 123.140 కిలోలు

న్యూస్‌రీల్

కూచిపూడిలో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న హేమశ్రీ

రాయచోటి జగదాంబసెంటర్: కూచిపూడి నృత్య ప్రదర్శనలో రాయచోటికి చెందిన హేమశ్రీ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. 2023 డిసెంబర్ 24న హైదరాబాద్‌లో జరిగిన నృత్య ప్రదర్శనలో హేమశ్రీ విశేష ప్రతిభ కనబరిచారు. ఈనెల 13న హైదరాబాద్‌లోని మణికొండలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు సంబంధించిన ప్రశంసాపత్రం అందుకున్నారు. దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలాప్రసాద్, జబర్దస్త్ నటుడు హైపర్ ఆదిలు హేమశ్రీకి ప్రశంసాపత్రం అందజేశారు. హేమశ్రీకి పలువురు రాయచోటి అభినందనలు తెలిపారు.

జులై 14 నుంచి బీఈడీ, ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు


కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ, ఎంఈడీ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు జూలై 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీఈడీ 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థులకు, అలాగే ఎంఈడీ రెండు, నాలుగు సెమిస్టర్ల సప్లిమెంటరీ, రెగ్యులర్ విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి జరగాల్సిన బీఈడీ, ఎంఈడీ పరీక్షలను డీఎస్సీ (ఉపాధ్యాయ ఉద్యోగ నియామకపు పరీక్ష) రాసే విద్యార్థుల అభ్యర్థన దృష్ట్యా, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూలై 14వ తేదీకి వాయిదా వేశామన్నారు. రీషెడ్యూల్ అయిన తేదీల టైం టేబుల్ విద్యార్థులు చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

మామిడి.. దక్కని పెట్టుబడి

- ధరలు లేక రైతుల విలవిల
- తోటల్లోనే బాక్సుల్లో మగ్గుతున్న కాయలు



వ్యాపారులు రాక మండీలోనే రాశులు పోసిన మామిడికాయలు



రాయచోటి: మామిడి ధరలు పతనం కావడంతో తోటలోనే కాయలు మాగిపోతున్నాయి. చెట్లతోనే మగ్గిపురుగులు పడుతున్నాయి.. ఒకవైపు వర్షపు జల్లులు కురుస్తుండగా..మరోవైపు కొనేవారు లేక కోసిన కాయలు మండీలలోనే మగ్గుతున్నాయి. బేనీషా రకం టన్ను రూ.15 వేలు పలుకుతుండగా బెంగళూరు రకం టన్ను రూ. 6 వేలకు మించి పలకడం లేదని రైతులు, వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ధరల పతనంతో మామిడినే నమ్ముకున్న రైతులు, వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.జిల్లాలో 33 వేల హెక్టార్లలో వివిధ దశల్లో మామిడి సాగులో ఉంది. అన్నమయ్య జిల్లా నుంచి వేల టన్నులు మామిడికాయలు ఏటా పక్క రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. ఈ ఏడాది బయట వ్యాపారులు జిల్లాకు రాకపోవడంతో మామిడి వ్యాపారం భారీగా పతనమైంది. పక్వానికి వచ్చి మాగిపోయి పురుగులు పడుతున్న కాయలు తోటలు దాటడం లేదు. ఫలితంగా మామిడిని నమ్ముకున్న రైతులు తోటల్లోనే కుళ్లిపోతున్న కాయలను చూసి కుమిలిపోతున్నారు.

- జిల్లాలో అధికంగా బెంగళూరు (తోతాపూరి), బేనీషా, ఖాదర్, నీలం, మల్లిక ఇతర రకాలు సాగులో ఉన్నాయి. అత్యధికంగా బేనీషా, బెంగళూరు రకాలు వేల టన్నుల దిగుబడి ఉంటుంది. ఏటా వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం పండిన కాయలు తోట నుంచి బయటికి వెళ్లకపోవడంతో మామిడిపై ఆశలు పెంచుకున్న రైతులు తోటలోనే కుప్పకూలిపోయారు. పంట సంరక్షణ కోసం లక్షలాది రూపాయలను వ్యయం చేసినా పెట్టుబడులు రాక గగ్గోలు పెడుతున్నారు. మామిడిని తొలి నుంచి మంచు దెబ్బ, తెగుళ్లు, వర్షాలు, ఈదురుగాలులు వెంటాడుతున్నాయి. తీరా దిగుబడి సమయంలో వ్యాపారులు రాక ధరలు పలకలేదు. స్థానిక వ్యాపారులు మామిడి కాయలు కోయవద్దని, మండీలకు తీసుకురావద్దని చెప్పడంతో కాయలు చెట్లలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం ఉన్న కాయలను కోసి మండీలకు తరలిద్దామంటే కూలీలు, ట్రాక్టర్ల అద్దెలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.
- మామిడి సాగులో మంచి దిగుబడుల కోసం రైతులు ఆరేడు సార్లు దుక్కులు చేస్తారు. ఎశువుల ఎరువుతో పాటు డీఏపీ, సూపర్ పాస్పేట్, వేపపిండిని కలిపి పిచికారీ చేస్తారు. ఇలా ఎకరానికి రూ.30 వేలకు పైగా ఖర్చు చేస్తారు. చీడపీడలాశించకుండా ఎకరాకు మరో రూ.10 వేలు మందులను పిచికారీ చేస్తారు. ప్రస్తుతం మామిడి కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

కాయలు ఫుల్.. వ్యాపారులు నిల్

మండీల నిండా మామిడికాయలు ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసే వ్యాపారులు మాత్రం కనిపించడంలేదు. చిత్తూరు జిల్లా తర్వాత అన్నమయ్య జిల్లాలోని బేనీషా, లాల్‌బహార, ఖాదర్, దసేరి వంటి రకాలకు డిమాండ్ ఉంటుంది. రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లోని మండీల్లో మామిడి వ్యాపారం అధికంగా జరుగుతుంది. జిల్లా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, హర్యానా రాష్ట్రాలతో పాటు విదేశాలకు మామిడి ఎగుమతి అవుతుంటుంది. కాయలను తీసుకెళ్లేందుకు లారీలు రోజుల తరబడి లైన్లలో ఉండేవి. ప్రస్తుతం ధరలు లేకపోవడంతో మండీల వద్ద లారీలు లేక వెలవెలబోతున్నాయి.

గిట్టుబాటు ధరలు కల్పించాలి



ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి మామిడికాయలకు గిట్టుబాటు ధర కల్పించడంపై రైతులతో సంప్రదించాలి. పంటకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర కల్పించాలి. మామిడి జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులతో ప్రభుత్వం సంప్రదింపులు చేసి నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి.

– బి.వెంకటరమణ, రైతు, కొండమూల, చిన్నమండెం

రైతుసంక్షేమం పట్టని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమంపై శ్రద్ధ చూపడం లేదు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాల పంపిణీలో, సాగుకు అవసరమైన ఆర్థిక భరోసా కల్పించడంతో విఫలమైంది. మామిడి రైతులు గిట్టుబాటు ధరలు లేక పెట్టిన పెట్టుబడులు రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కు తెలియని స్థితిలో ఉన్నారు.ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– రెడ్డప్పరెడ్డి, నేరెళ్లవంక, రాయచోటి, మామిడి రైతు

చెరువుకు చెర

- మిలటరీ పట్టా పేరుతో ఆక్రమణకు పాల్పడుతున్న మంత్రి బంధువులు
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ శాఖలు

టాస్క్‌ఫోర్స్: సాగుకు, పట్టణ ప్రజలకు పర్యాటక ప్రాంతంగా ఉన్న చెరువులను అక్రమార్కులు చెరపడుతున్నారు. రాయచోటి పట్టణ సమీపంలోని ఇనాయత్ ఖాన్ చెరువు ఆక్రమణకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమీప బంధువులు సిద్ధమయ్యారు. మట్టి, ఇసుక మాఫియా, రియల్టర్ల దెబ్బకు చెరువులే మాయమవుతున్నాయి. పట్టణ పరిధిలో ఉన్న రింగ్ రోడ్డుకు సమీపంలో ఈ చెరువు ఉంది. అధికారమే అండగా, సంపాదనే ధ్యేయంగా ప్రకృతి వనరులను దోచుకుతింటున్న కూటమి నాయకులు నేడు కోట్ల రూపాయలు విలువచేసే ఈ చెరువు ఆక్రమణకు సిద్ధమయ్యారు. చెరువు ఎగువ భాగాన సర్వే నంబరు. 509/2లో మిలటరీ పట్టా పేరుతో 2.5 ఎకరాల భూమిని ఆక్రమించగా సమీపంలోనే ఉన్న మరికొంత భూమిని చదును చేస్తున్నారు. ఇందుకోసం టిప్పర్లతో మట్టిని తోలారు. ఇప్పటికే చెరువులోకి పైభాగం నుంచి వచ్చే వాగులను ఆక్రమించి సిమెంటు కాంక్రిట్లతో అడ్డుకట్టలు వేసి ప్లాట్‌లు వేసి విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

- రాయచోటి పట్టణం రింగ్ రోడ్డు పరిధిలోని పెమ్మాడపల్లి మార్గంలో ఉన్న ఇనాయత్ ఖాన్ చెరువు పట్టణానికి ఎగువ భాగంలో ఉన్న కంచాలమ్మ గండి చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చి దిద్దాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రయత్నాలు చేశారు. అధికార పార్టీ నాయకులు వీటిని ఆక్రమించేందుకు సిద్ధపడటంపై స్థానికులు మండిపడుతున్నారు.

రికార్డులు మాయం

రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో డీకేటీ, మిలటరీ పట్టాలకు సంబంధించిన ప్రధాన రికార్డులు మాయమైనట్లు సమాచారం. రాయచోటి పట్టణం చుట్టూ కోట్ల రూపాయలు విలువచేసే భూములను ఆక్రమించి వాటికి నకిలీ డికేటీ పట్టాలు, నకిలీ మిల్ట్రీ పట్టాలను సృష్టించి దర్జాగా ఆక్రమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పట్టాల విషయంపై స్థానిక మీడియా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులను గతంలో పలుమార్లు ప్రశ్నించిన సందర్భంలో పట్టాలిచ్చిన రికార్డులు కనిపించడం లేదన్న సమాధానాలు ఇచ్చారు.



ఇనాయత్ ఖాన్ చెరువు పైభాగంలో మట్టితోలి చదును చేసిన దృశ్యం

క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో ప్రతిభ



జయంత్‌రెడ్డి

మదనపల్లె సిటీ : నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మదనపల్లెకు చెందిన కె. జయంత్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. శనివారం విడుదల చేసిన ఫలితాల్లో మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి ,శ్రావణిల కుమారుడు జయంత్‌రెడ్డి 4571 ఆలిండియా ర్యాంకు సాధించాడు. ఏపీ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 48 ర్యాంకు దక్కించుకున్నాడు. ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య కాలేజీలో చదివాడు. ఇంటర్మీడియట్‌లో 978 మార్కులు సాధించాడు. జయంత్‌రెడ్డిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

కలకడ : కలకడ మండలం కె.బాటవారిపల్లె వద్ద శనివారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె జంగంపల్లెకు చెందిన శ్రీనివాసులు(49) తన ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి కలికిరి వైపు వెళ్తూ.. ముందుగా ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రకాష్‌నగర్‌లో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకాష్‌నగర్‌లో నివాసం వుంటున్న భవనాసి శ్రీనివాసులు (ఎల్‌ఐసీ, ఏఏఓ), ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న అతని భార్య మేరీ స్టెల్లా శుక్రవారం రాత్రి తమ ఇంటికి లోపలివైపు నుంచి తాళాలు వేసుకుని బెడ్‌రూంలో నిద్రిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనుకవైపున కటాంజనం (ఇనుపవాకిలి)కి వేసిన తాళం పగులగొట్టాడు. ఎంచక్కా ఇంటిలోకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులోని బంగారు ఆభరణాలను దాదాపు ఏడు తులాలు, రూ.లక్షకు పైగా నగదును దోచుకుపోయాడు. ప్రకాష్‌నగర్‌లోనే సంచరించిన సదరు దొంగ మూడు ఇళ్లలో కాలింగ్‌బెల్ నొక్కి దొంగతనాలకు ప్రయత్నించాడు. వీరి ఇంటిలో దొంగతనం చేశాడు. సీసీ పుటేజీల ఆధారంగా దొంగకోసం గాలింపు చర్యలను చేపట్టారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌక్ ఎస్‌ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి, క్లూస్ టీంతోపాటు సిబ్బంది పరిశీలించారు.

ఆరుగురు పగటి దొంగలు అరెస్ట్

- రూ.20లక్షల విలువచేసే నగలు, నగదు, వెండి స్వాధీనం
- నిందితుల్లో ఒకరు కేఎస్‌ఆర్టీసీ డ్రైవర్ కం కండక్టర్
- చోరీ వివరాలు వెల్లడించిన డీఎస్పీ మహేంద్ర



ఆరుగురు పగటి దొంగలను అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : తాళం వేసిన ఇళ్లను గుర్తించి, పగటిపూట దొంగతనాలకు పాల్పడే ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి, సుమారు రూ.20 లక్షల విలువచేసే నగలు, వెండి, నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. శనివారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ముదివేడు, మదనపల్లె వన్,టూ, తాలూకా పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన ఆరు కేసులకు సంబంధించి నిందితులను అరెస్ట్ చూపారు. మదనపల్లె తాలూకా సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ చోరీలకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీ మందబండకు చెంది ప్రస్తుతం కొండామర్రిపల్లె టీఎస్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మౌలాలి అలియాస్ బాబు(52), కర్ణాటక చింతామణి తాలూకా జోగులగడ్డ బూరగమాకులపల్లెకు చెందిన కేఎస్‌ఆర్టీసీ డ్రైవర్ కం కండక్టర్ ఎస్.శంకర(48), కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ గౌనువారిపల్లెకు చెందిన పాలెం నరసింహులు(45), మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీ పాకాలవారిపల్లెకు చెందిన వరగాని నవీన్ కుమార్(30), కురబలకోట మండలం తెట్టు పంచాయతీ, చింతమాకులపల్లెకు చెందిన అనంత విశ్వనాథరెడ్డి(65), చిత్తూరుజిల్లా గంగవరం మండలం మడుగూరుకు చెందిన నీరుగట్టి రమేష్(44)..ఆరుగురు ఓ టీ హోటల్‌లో కలుసుకున్నారు. డబ్బులు సంపాదించేందుకు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ముదివేడు, మదనపల్లె పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పగటిపూట ద్విచక్రవాహనాలపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించేవారు. కాసేపు అక్కడే రెక్కీ నిర్వహించారు. ఎవరూ గమనించడం లేదని తెలుసుకుని ఇద్దరు తాళాలు పగలగొట్టి లోనికి వెళితే ఇద్దరు ఇంటి వద్ద, మిగిలిన ఇద్దరు వీధి ప్రారంభంలో కాపలా కాసేవారు. దొంగతనం పూర్తిచేసుకుని బయటకు వచ్చాక దర్జాగా ద్విచక్ర వాహనాల్లో అక్కడ నుంచి వెళ్లిపోయేవారు. దొంగతనం చేసిన నగలు, వస్తువులను కర్ణాటకలోని చింతామణిలో విక్రయించి, వచ్చిన సొమ్ములతో విలాసాలకు ఖర్చుచేయడం, గోవా తదితర ప్రాంతాలకు టూర్లు వెళ్లడం చేసేవారు.

సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా..

దొంగతనాలకు సంబంధించి ముదివేడు, మదనపల్లె పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా లభించిన వేలిముద్రలు, సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నేరస్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు..శనివారం ఉదయం 7 గంటల సమయంలో కురబలకోట మండలం చేనేతనగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకోగా, అప్పటికే అక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్న ఆరుగురు మగ వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి సుమారు 150 గ్రాముల బంగారు నగలు, 762 గ్రాముల వెండి వస్తువులు, రూ.5,28వేల రూపాయల నగదుతో పాటుగా నేరానికి ఉపయోగించిన రెండు ఇనుప రాడ్లు, ఒక స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. నిందితుల్లో ఏ1 అయినటువంటి షేక్ మౌలాలిపై బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో రెండు ఎర్రచందనం కేసులు, ఏ4 వరగాని నవీన్‌కుమార్‌పై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు, ఏ5 అనంత విశ్వనాథరెడ్డిపై ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో లిక్కర్ కేసు ఉందన్నారు. ఏ2 అయినటువంటి ఎస్.శంకర, కేఎస్‌ఆర్టీసీలో డ్రైవర్ కం కండక్టర్‌గా పనిచేస్తూ, అదనపు ఆదాయం కోసం దొంగతనాలను ఎంచుకున్నాడన్నారు. చోరీ చేసిన సొత్తును విక్రయించి నగదు చేయడంలో ముఠాలో కీలకంగా వ్యవహరించేవాడని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచి ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, శంకర్, పీసీలు రాఘవరెడ్డి, శివ, శంకర, దొరబాబు, చలపతి, ముదివేడు పోలీసులు హరి, శ్రీనివాసులు, వెంకటేష్, కే.శ్రీనివాసులు, శాంతకుమార్, ప్రేమ్‌కుమార్, బ్రహ్మేష్, రాజేష్, రెడ్డిశేఖర్, సిద్ధేశ్వర్‌లను అభినందించారు.

ఇద్దరు యువకులను బలిగొన్న
రోడ్డు ప్రమాదం కేసు ఛేదింపు

ప్రమాదానికి కారణమైన లారీ సహా డ్రైవర్ అరెస్టు



నిందితుడు లారీ డ్రైవర్‌ను చూపుతున్న పోలీసులు

పెద్దతిప్పసముద్రం : ఈ ఏడాది మార్చి 17న అర్ధరాత్రి పీటీఎం–బి.కొత్తకోట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సాదిలి చందూ కుమార్ (20), దండు శీనూ (21) బి.కొత్తకోటలో సెకండ్ షో సినిమా చూసి తిరిగి పీటీఎంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా యువకులిద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. చందూకుమార్ తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లారీకి చెందిన వస్తువు ఆధారంగా ఎస్‌ఐ ఈ కేసును సవాల్‌గా తీసుకుని ఎట్టకేలకు ఛేదించారు. ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు... ప్రమాద స్థలంలో టీఏ అని ఆంగ్ల అక్షరాలు కలిగి ఉన్న పార్కింగ్ స్టాండ్ పీస్ ఆధారంగా కేసును ఛేదించామన్నారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన సిమెంటు ట్యాంకర్ లారీ ద్విచక్ర వాహనదారులను బలంగా గుద్ది ముందుకు వెళుతుండగా ఈ దృశ్యాన్ని చూసిన పలువురు కేకలు వేస్తున్నప్పటికీ లారీ డ్రైవర్ దవరిక యాదవ్ (30) వాహనం నిలిపినట్టే నిలిపి ఒక్కసారిగా వేగంగా ముందుకు వెళ్ళిపోయినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతరం ప్రమాద స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలతో పలు చోట్ల ప్రధాన రహదారుల్లోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి పోలీస్ సాంకేతిక నిపుణుల చొరవ, స్థానిక పోలీసు సిబ్బంది సహకారంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వాహన యజమానిని సంప్రదించగా లారీ సహా ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ శనివారం స్టేషన్‌లో లొంగిపోగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తల్లి, కుమార్తె ఆత్మహత్యాయత్నం

తల్లి పరిస్థితి విషమం



ఆత్మహత్యయత్నానికి పాల్పడిన జానకమ్మ

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో తల్లి, కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తల్లి పరిస్థితి విషమంగా మారిన సంఘటన శనివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. మండలంలోని వెలిగల్లు పంచాయతీ పడమటివారిపల్లెకు చెందిన నాగిరెడ్డి భార్య జానకమ్మ(30), కుమార్తె వర్షారెడ్డి(10) కుమారుడు ఉన్నారు. అయితే గత కొంత కాలంగా నాగిరెడ్డి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేయడంతో జానకమ్మ తీవ్రంగా మనస్థాపం చెందింది. శనివారం తాను విషం తాగి పిల్లలకు విషం ఇవ్వాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా పురుగు మందు జ్యూస్‌లో కలుపుకుని ఆమె సగం తాగి, కుమార్తె వర్షారెడ్డికి ఇచ్చింది. కుమార్తె కొద్దిగా తాగి చేదుగా ఉందని చెప్పింది. అయితే జానకమ్మ కుమారుడిని పిలవమని చెప్పడంతో వర్షారెడ్డి వెళ్లింది. ఎక్కువ మోతాదులో జానకమ్మ తాగడంతో జానమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు జానకమ్మతో పాటు వర్షారెడ్డిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం జానకమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులుకేసు విచారణ చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్య

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలిలా.. పట్టణంలోని రామగోపాల్‌నాయుడు వీధికి చెందిన ఆదినారాయణ కుమారుడు లోకేష్(31)కదిరిరోడ్డులోని ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అతడు అవాహితుడు. గత కొంత కాలంగా కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమవుతూ మనస్థాపానికి గురయ్యాడు. మూడు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. టు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కలకడ : మండలంలో 330 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సారా ఊటను ధ్వంసం చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ వి.సుబ్బారెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం దిగువతాండ గ్రామం సమీపంలో నాటుసారా వండుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించగా దిగువతాండకు చెందిన శశినాయక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి ద్విచక్రవాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : పీలేరు మండల పరిధిలోని జంగంపల్లెకు చెందిన భాగ్యమ్మ అనే మహిళ వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల నాటుసారా గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా చట్టపరమైన కేసులు తప్పవని హెచ్చరించారు.

చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ –19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు విజయ ఢంకా మోగించాయి. శనివారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో నెల్లూరు జట్టుపై 110 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది, టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 46.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 237పరుగులు చేసింది. ఆ జట్టులోని సోహన్‌రెడ్డి 119 బంతులకు 110 పరుగులు చేశాడు . నెల్లూరు జట్టులో భార్గవ్ మహేష్ 5, తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 238 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేశారు. ఆ జట్టులోని సాహుల్ హామీద్ 60 పరుగులు చేశాడు . చిత్తూరు జట్టులోని ధనుష్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు.

110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం:

కెఎస్‌ఆర్‌ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన అనంతపురం జట్టు 50 ఓవర్లలకు 283 పరుగుల చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రిహాన్ 16 ఫోర్లు, 2 సిక్సర్లతో117 పరుగులు చేశాడు. అనంతరం 284 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని కెవి ఓంకార్ 57 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నిషిచ్ 5, టివి సాయి ప్రతాప్ రెడ్డి 5 వికెట్లు తీసుకున్నారు.

రెడీమేడ్ షాపులో చోరీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రెడీమేడ్ దుకాణంలో శుక్రవారం అర్థరాత్రి దొంగలు పడి రూ. 70 వేలు నగదుతో పాటు దుస్తులు చోరీ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు


– జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్



గొర్రెలకు టీకాలను వేస్తున్న పశువైద్య సిబ్బంది

రాజంపేట రూరల్ : జిల్లా పరిధిలోని గొర్రెలకు నీలి నాలుక బ్లూ టంగ్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందించనున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ తెలియజేశారు. మండల పరిధిలోని హెచ్ చెర్లోపల్లి గొల్లపల్లి గ్రామంలో శనివారం గొర్రెలకు నీలి నాలుక (బ్లూ టంగ్) వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా అందజేశారు డాక్టర్ గుణశేఖర్ గొర్రెల యజమానులకు నీలి నాలుక వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. అలాగే టీకాల ఆవశ్యకతను, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్, హెచ్ చెర్లోపల్లి పశువైద్యాకారి డాక్టర్ కే.భాగ్యావతి, జూనియర్ వెటర్నటీ అధికారి ఎం.వరదయ్య, గోపాల మిత్రలు ఎం .బాస్కర్, సీ.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో బొగ్గు కూలీ మృతి



మృతి చెందిన అంకయ్య

మదనపల్లె రూరల్ : జీవనోపాధి కోసం నెల్లూరు జిల్లా నుంచి వలస వచ్చి బైక్‌లో వెళుతూ ప్రమాదంలో బొగ్గుకూలీ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగింది. నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన ఎం.అంకయ్య(30) తన భార్య ప్రశాంతి, కుటుంబంతో సహా ఉపాధి నిమిత్తం కలకడ సమీపంలోని మల్లిగుట్టపల్లెకు వచ్చి రెండేళ్లుగా ఉంటున్నాడు. స్థానికంగా కలప కాల్చి బొగ్గు తయారీ కూలిగా పనిచేస్తున్నాడు. 11వతేదీ బుధవారం కలప కోసేందుకు వినియోగించే యంత్రం మరమ్మతుకు గురి కావడంతో రిపేరీ చేసుకునేందుకు గుర్రంకొండకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తూ వాహనం అదుపుతప్పి మార్గమధ్యంలో రోడ్డుపక్కన ఉన్న బోర్డును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్సలు చేయడంతో కోలుకుని ఇంటికి వెళ్లాడు. గురువారం ఒంట్లో నలతగా ఉంటే మదనపల్లెకు వచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నాడు. ప్రమాదం లేదని చెప్పడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. అయితే శరీరంలోని లోపలి గాయాలు తిరగబెట్టడంతో శనివారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సొసైటీకాలనీలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు తిరుపతికి తీసుకెళ్లాలని రెఫర్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ ఉచితంగా అందుబాటులో ఉంటుందని సూచించడంతో, అంకయ్యను శనివారం సాయంత్రం తీసుకువచ్చారు. అత్యవసర విభాగంలో చికిత్స అందించినా అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగానే అంకయ్య మృతి చెందాడు. కాగా మృతునికి ముగ్గురు కుమార్తెలు పవిత్ర, కళావతి, గౌతమి ఉన్నారు.